## క్లుప్తంగా

### ఎన్నికల ప్రక్రియ పరిశీలన



ఓట్ల లెక్కింపును పరిశీలిస్తున్న కలెక్టర్ క్రాంతి

**జహీరాబాద్:** పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించిన కౌంటింగ్ ప్రక్రియను కలెక్టర్ క్రాంతి మంగళవారం పరిశీలించారు. జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలోని జహీరాబాద్, అందోల్, నారాయణఖేడ్, ఎల్లారెడ్డి, కామారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ అసెంబ్లీ స్థానాల వారీగా ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాలకు ఆమె ఉదయమే చేరుకొని కౌంటింగ్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. కౌంటింగ్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసినట్లు కలెక్టర్ తెలిపారు.

### ప్రశాంతంగా ముగిసిన కౌంటింగ్



ఎస్పీ రూపేష్

**సంగారెడ్డి:** జహీరాబాద్ పార్లమెంటు స్థానంతో పాటు నియోజకవర్గానికి సంబంధించిన ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు నిర్వహించిన ఓట్ల లెక్కింపు ప్రక్రియను గీతం యూనివర్సిటీలో ప్రశాంతంగా ముగిసిందని ఎస్పీ రూపేష్ పేర్కొన్నారు. ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియకు ఎలాంటి అంతరాయం కలగకుండా నియోజకవర్గాల వారీగా కౌంటర్లను, ప్రత్యేక బ్యారికెట్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రశాంత వాతావరణంలో ఎలాంటి అల్లర్లకు, గొడవలకు తావులేకుండా ఓట్ల లెక్కింపు ప్రక్రియ విజయవంతంగా పూర్తి చేయడంలో కీలకంగా వ్యవహరించిన అధికారులు, సిబ్బందితో పాటు అందుకు సహకరించిన జిల్లా ప్రజలకు, ప్రజాప్రతినిధులకు ఎస్పీ కతజ్ఞతలు తెలిపారు.

### 8న చేప ప్రసాదం పంపిణీ

**నారాయణఖేడ్:** మృగశిర కార్తె సందర్భంగా నిజాంపేట్ మండల కేంద్రంలో ఈ నెల 8న ఉదయం 7.30 గంటల నుంచి చేప ప్రసాదాన్ని పంపిణీ చేయనున్నట్లు నిర్వాహకులు తడకంటి పర్వాగౌడ్, లక్ష్మీనారాయణగౌడ్, శంకర్‌గౌడ్, లింగాగౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తమ పూర్వీకుల నుంచి ఆనవాయితీగా ప్రసాదం పంపిణీ చేస్తున్నామన్నారు. ఏటా చేప ప్రసాదం కోసం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు పొరుగున ఉన్న కర్ణాటక, మహారాష్ట్ర నుంచి సైతం అధిక సంఖ్యలో ప్రజలు వస్తుంటారని తెలిపారు. ఈ అవకాశాన్ని ఉబ్బసం, దగ్గు వ్యాధి ఉన్న బాధితులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

### రేపు శనీశ్వరుడి జయంతి

**జహీరాబాద్ టౌన్:** తెలంగాణ దేవదాయ ధర్మదాయ శాఖ పరిధిలోని సిద్దేశ్వరస్వామి ప్రాంగణంలో శనీశ్వర స్వామి జయంతిని ఈ నెల 6న నిర్వహిస్తున్నట్లు ఈఓ మోహన్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా శనీశ్వరస్వామికి రుద్రాభిషేకం, కుంకుమార్చన, కాలభైరవస్వామికి అభిషేకం, శనీశ్వరస్వామికి తైలాభిషేకం, శని మూలమంత్ర హోమం, పూర్ణాహుతి, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొనాలని సూచించారు.

### వ్యక్తి అదృశ్యం



వీరస్వామి

**పటాన్‌చెరు టౌన్:** ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పటాన్‌చెరు మండల పరిధిలోని చిన్నకంజర్ల గ్రామానికి చెందిన వీరస్వామి కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గత నెల 12వ తేదీన భార్య లక్ష్మితో గొడవపడ్డాడు. దీంతో లక్ష్మి పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి ఒంటరిగా ఉంటున్న వీరస్వామి 14వ తేదీన ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు వీరస్వామి కోసం ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

**మరో ఘటనలో...**

**మునిపల్లి(అందోల్):** ఎప్పటిలాగే పనికి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. బుదేరా పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని కంకోల్ గ్రామానికి చెందిన దోషాడ సంగమేశ్ కంకోల్ వోక్స్‌వ్యాగన్ యూనివర్సిటీలో కొంతకాలంగా గార్డెన్ వర్కర్‌గా పని చేస్తున్నాడు. ఎప్పటిలాగే అదివారం పనికి వెళ్లిన సంగమేశ్ తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో సోమవారం యూనివర్సిటీ యాజమాన్యంను నిలదీయగా పొంతనలేని సమాధానం చెప్పడంతో కుటుంబ సభ్యులు యూనివర్సిటీ ఎదుట ఆందోళనకు దిగారు. సంగమేశ్వర్ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# హరితహారానికి మొక్కలు సిద్ధం

**1,41,360 నాటడమే లక్ష్యంగా ప్రణాళికల రూపకల్పన**

- కసరత్తులు ప్రారంభించిన అధికారులు
- అవసరమైన చోటే మొక్కలు నాటేందుకు ప్రభుత్వ నిర్ణయం



కవలంపేట నర్సరీలో సిద్ధంగా ఉన్న హరితహారం మొక్కలు

హరితహారంలో భాగంగా నర్సరీలలో పెంచుతున్న మొక్కలను ఈ ఏడాది అవసరమున్న చోటే నాటాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందుకు అనుగుణంగా కంది మండలంలో 1,41,360 మొక్కలు నాటడమే లక్ష్యంగా అధికారులు ప్రణాళికలను రూపొందించారు. మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో అవకాశం ఉన్న చోటే మొక్కలు నాటేవిధంగా క్షేత్ర స్థాయి సిబ్బంది నుంచి ప్రతిపాదనలను తయారు చేశారు.

– కంది(సంగారెడ్డి)

కంది మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ఈ ఏడాది 1,41,360 మొక్కలను నాటేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో వన నర్సరీలను ఏర్పాటు చేసి వాటిలో వివిధ రకాల మొక్కలను పెంచుతున్నారు. గతేడాది నాటిన మొక్కల్లో సగానికి పైగా ఎండిపోయాయి. గత ప్రభుత్వ హయాంలో మొక్కలు అధికంగా నాటాలని ఉపాధిహామీ అధికారులపై ఒత్తిడి ఉండటంతో అదేస్థాయిలో మొక్కలు నాటారు. వర్షాభావ పరిస్థితులతో నాటిన మొక్కల్లో చాలావరకు ఎండిపోయాయి. దీంతో ఏ గ్రామంలో ఎన్ని మొక్కలు నాటే అవకాశం ఉందో ముందే గుర్తించాలని ప్రభుత్వం సూచించినట్లు అధికారులు చెబుతున్నారు.

**నాటేందుకు సిద్ధంగా మొక్కలు**

ఆయా గ్రామాల్లో అవసరాన్ని బట్టి మొక్కలు నాటేందుకు ఉపాధిహామీ సిబ్బందితో కలిసి అధికారులు మొక్కలను సిద్ధం చేశారు. మండల పరిధిలో 22 గ్రామ పంచాయతీలు ఉండగా ఒక్కో జీపీకి 2700 చొప్పున 59,400 అదేవిధంగా మండలంలో 13,660 ఇండ్లు ఉండగా ప్రతి ఇంటికి 6 మొక్కల చొప్పున 81,960 నాటనున్నారు. మొత్తం 1,41,360 మొక్కలను నాటేందుకు ఏర్పాట్లు సిద్ధం చేశారు. అదేవిధంగా 50 ఎకరాల్లో ఉద్యానవనశాఖ ద్వారా పండ్ల తోటలను పెంచాలని లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించారు. ఆసక్తి ఉన్న రైతుల వివరాలను సేకరించి వారిపొలాల్లో వివిధర కాల పండ్ల మొక్కలను ఉపాధికూలీల ద్వారా నాటిస్తారు. అదేవిధంగా ఐదేళ్ల వరకు నిర్వహణ ఖర్చులు చెల్లిస్తారు. జామ, ఉసిరి, అల్లనేరేడు, సపోటా, మామిడి, సీతాఫలం, ఖర్జూరం, బాధాం తదితర మొక్కలను రైతులకు ఇవ్వనున్నట్లు యస్‌ఆర్జీఎస్ అధికారులు చెబుతున్నారు.

> **ప్రణాళికలు సిద్ధం చేశాం**
>
> వర్షాకాలం ప్రారంభం కాగానే మొక్కలు నాటుతాం. హరితహారంలో భాగంగా ఈ ఏడాది నిర్దేశించిన లక్ష్యం మేరకు ప్రణాళికలు సిద్ధం చేశాం. అదేవిధంగా ఉద్యానవనశాఖ ద్వారా పండ్ల మొక్కలను పెంచేందుకు రైతుల పొలాల ఎంపిక కూడా పూర్తయింది. వర్షాకాలం ప్రారంభం కాగానే మొక్కలను నాటిస్తాం.
>
> – గురుపాదం, ఎన్ఆర్‌జీఎస్ ఏపీఎం

# ఫీజుల దోపిడీని అరికట్టాలి

**ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మహేష్**



ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదుట మాట్లాడుతున్న నాయకులు

**పటాన్‌చెరు టౌన్:** నూతన విద్యా సంవత్సరం ప్రారంభం అవుతున్న వేళ ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మహేష్ డిమాండ్ చేశారు. అనుమతులు లేకుండా అడ్మిషన్ చేస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫీజుల నియంత్రణ చట్టాన్ని ప్రభుత్వం పకడ్బందీగా అమలు చేయాలన్నారు. జిల్లాలో కొన్ని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు ప్రభుత్వ అనుమతులు లేకుండా ముందస్తుగా అడ్మిషన్లు తీసుకుంటూ విద్యార్థుల తల్లిదండ్రులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఏడాదిలో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థుల నుంచి టీసీ, స్టడీ సర్టిఫికెట్, బోనఫైడ్ రూపంలో అందినకాడికి దోచుకుంటున్నారని తెలిపారు. విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయని పాఠశాలలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాల విద్యార్థులకు 25శాతం ఉచితంగా విద్యను అందించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు, విజయ్, అనుష, మౌనిక, హారిక తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ శ్రేణుల విజయానందం



జిన్నారంలో సంబరాలు జరుపుకుంటున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు

**జిన్నారం(పటాన్‌చెరు):** మెదక్ ఎంపీగా రఘునందన్‌రావు గెలుపొందటంతో జిన్నారం మండల పరిధిలోని గుమ్మడిదల, బొంతపల్లి తదితర గ్రామాలతో పాటు బొల్లారం మున్సిపాలిటీలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం ఘనంగా సంబరాలను జరుపుకున్నారు. ఎంపీగా రఘునందన్‌రావును గెలిపించేందుకు కృషి చేసిన ప్రతిఒక్కరికీ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు జగన్‌రెడ్డి, నాయకులు ప్రతాప్ రెడ్డి, రాజిరెడ్డి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్ ఫార్ములానే గెలుపునకు నాంది

**2009, 2024లో సురేష్‌షెట్కార్ విజయం**



సురేష్ షెట్కార్

**నారాయణఖేడ్:** జహీరాబాద్ లోక్‌సభ స్థానంలో కాంగ్రెస్ పార్టీ గెలుపొందడానికి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఫార్ములానే ఉపయుక్తమయ్యింది. పార్లమెంట్ స్థానాల పునర్వవస్థీకరణలో భాగంగా మెదక్ లోక్‌సభ స్థానంలో ఉండగా 2009లో జహీరాబాద్ పార్లమెంట్ స్థానంగా మరో పార్లమెంట్ స్థానంగా ఏర్పాటయ్యింది. జిల్లాలోని నారాయణఖేడ్, జహీరాబాద్, ఆందోల్, కామారెడ్డి జిల్లాలోని జుక్కల్, బాన్సువాడ, ఎల్లారెడ్డి, కామారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గాలు కలుపుతూ ఏర్పాటు చేశారు. 2009లో నూతన పార్లమెంట్ స్థానం ఏర్పాటు అయ్యాక నాటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఈ స్థానానికి నారాయణఖేడ్‌కు చెందిన సిట్టింగ్ ఎమ్మెల్యే అయిన సురేష్‌షెట్కార్ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేశారు. అదేవిధంగా ఖేడ్ అసెంబ్లీ స్థానానికి మాజీ ఎమ్మెల్యే కిష్టారెడ్డిని పోటీకి నిలుపగా కిష్టారెడ్డి ఎమ్మెల్యేగా, ఎంపీగా సురేష్‌షెట్కార్ ఇద్దరూ గెలుపొందారు. నాడు ఎమ్మెల్యేగా కిష్టారెడ్డి గెలుపునకు సురేష్‌షెట్కార్ పాటుపడగా ఎంపీగా సురేష్‌షెట్కార్ విజయం సాధించేందుకు కిష్టారెడ్డి కృషి చేశారు. డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చొరవతో ఈ నియోజకవర్గంలో వీరిద్దరి మధ్య ఉన్న గ్రూపు విబేధాలను ఇలా రూపుమాపేలా చేశారు. అనంతరం ఇద్దరు నేతలూ అభివృద్ధిలో భాగస్వాములయ్యారు. అనంతరం 2023లో ఇటీవల నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికల్లో తనకు వచ్చిన అసెంబ్లీ టికెట్‌ను దివంగత కిష్టారెడ్డి కుమారుడైన డాక్టర్ సంజీవరెడ్డికి సురేష్‌షెట్కార్ కేటాయించాడు. పార్టీ అధిష్టానం కూడా 2009లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అమలు చేసిన ఫార్ములానే 2023 అసెంబ్లీ ఎన్నికల్లో అమలు చేసింది. దీంతో ఖేడ్‌లో ఎమ్మెల్యేగా డాక్టర్ సంజీవరెడ్డి గెలుపొందగా ఎంపీగా సురేష్‌షెట్కార్ గెలుపునకు డాక్టర్ సంజీవరెడ్డి కృషి చేశారు. 2009లో సురేష్‌షెట్కార్ 3,95,767ఓట్లు సాధించగా సమీప బీఆర్ఎస్ అభ్యర్థి సయ్యద్ యూసుఫ్ అలీ 3,78,360 ఓట్లు పొందారు. 17,407 ఓట్ల ఆధిక్యతతో సురేష్‌షెట్కార్ గెలుపొందారు. కాగా ప్రస్తుతం నిర్వహించిన జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల పరిధిలో సురేష్‌షెట్కార్ 5,23,919 ఓట్లు సాధించగా సమీప బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్ 4,76,023 ఓట్లు పొందారు. బీబీ పాటిల్‌పై సురేష్‌షెట్కార్ 47,896 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు.

### షెట్కార్ గెలుపులో జహీరాబాద్ అసెంబ్లీ కీలకం

**బీజేపీ అభ్యర్థిపై 35,278 ఓట్ల భారీ ఆధిక్యం**

**జహీరాబాద్:** పార్లమెంట్ స్థానానికి నిర్వహించిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన సురేష్‌షెట్కార్ గెలుపులో జహీరాబాద్ అసెంబ్లీ కీలక విజయాన్ని అందించింది. బీజేపీ అభ్యర్థి సిట్టింగ్ ఎంపీ బీబీ పాటిల్‌పై 35,278 ఓట్ల భారీ ఆధిక్యత కాంగ్రెస్‌కు లభించింది. సురేష్ షెట్కార్‌కు 1,02,929 ఓట్లు లభించగా బీబీపాటిల్‌కు 67,651 ఓట్లు లభించాయి. బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన గాలి అనిల్‌కుమార్‌కు 23,018 ఓట్లు పోలయ్యాయి. పార్లమెంట్ పరిధిలో పోస్టల్ బ్యాలెట్లు మినహా 23 రౌండ్ల ఓట్ల లెక్కింపులో సురేష్‌షెట్కార్‌కు బీబీ పాటిల్‌పై 46,174ఓట్ల ఆధిక్యత లభించగా ఇందులో జహీరాబాద్ అసెంబ్లీ నుంచే 35,278 ఓట్ల ఆధిక్యత లభించడం గమనార్హం. 2019 పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన మదన్‌మోహన్‌రావుకు జహీరాబాద్ అసెంబ్లీ స్థానంలోనే బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన బీబీ పాటిల్‌పై 26 వేల ఓట్ల ఆధిక్యత లభించడంతో గత ఎన్నికల రికార్డును ఇది అధిగమించినట్లయింది. అప్పటి ఎన్నికల్లో మాత్రం బీబీ పాటిల్ 6 వేల పైచిలుకు ఓట్ల మెజార్టీతో ఎంపీగా గెలుపొందారు. మూడో పర్యాయం ఓటమి నుంచి తప్పించుకోలేకపోయారు. 2014 ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి మొదటిసారిగా పోటీ చేసిన బీబీ పాటిల్ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన సురేష్‌షట్కార్‌పై గెలుపొందారు.

## ప్రజలు కాంగ్రెస్ పక్షమే

**నర్సాపూర్:** నియోజకవర్గ ప్రజలు కాంగ్రెస్ పక్షమే ఉన్నారని పీసీసీ ప్రధాన కార్యదర్శి, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ ఆవుల రాజిరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల తీర్పును స్వాగతిస్తామన్నారు. ప్రస్తుతం తమకు కొన్ని ఓట్లు తగ్గినా ప్రజలు మా పక్షమే ఉన్నారని చెప్పారు. నియోజకవర్గంలోని పార్టీ నాయకులందరం సమిష్టిగా పని చేసినందునే తమను ప్రజలు ఆదరించి మెజారిటీ ఇచ్చారని చెప్పారు.

**రెండో స్థానంలోకి బీఆర్ఎస్**

**నర్సాపూర్:** పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు 72వేల376 ఓట్లతో ప్రథమ స్థానంలో ఉన్నాడు. బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామారెడ్డి 54 వేల 372 ఓట్లతో ద్వితీయ స్థానంలో, 51వేల 811 ఓట్లతో బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు తృతీయ స్థానంలో ఉన్నారు. కాగా పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బీఆర్ఎస్‌పై 18,004 ఓట్ల ఆధిక్యత సాధించింది. కాగా కాంగ్రెస్‌కు అసెంబ్లీ ఎన్నికల కన్న ప్రస్తుతం 6581ఓట్లు తక్కువగా వచ్చినప్పటికీ ఆ పార్టీ ప్రథమ స్థానంలో నిలిచింది. బీజేపీకి అసెంబ్లీ ఎన్నికల్లో 22వేల 865 ఓట్లు రాగా, ప్రస్తుతం 51వేల 811 ఓట్లు రావడంతో బీజేపీకి ప్రస్తుత ఎన్నికల్లో 28వేల946 ఓట్లు పెరిగాయి.

**మోదీ హవాతోనే బీఆర్ఎస్ నష్టం..**

ప్రధాన మంత్రి నరేంద్రమోదీ హవా, అయోధ్యలో రామమందిరం నిర్మాణంతోనే బీజేపీకి ఓట్లు పెరిగాయని అభిప్రాయాలు వస్తున్నాయి. మోదీ హవాతో ఆ పార్టీకి భారీగా ఓట్లు పెరగడంతో బీఆర్ఎస్‌కు గండి పడిందనే అంటున్నారు.

# కాంగ్రెస్ మెజార్టీ తగ్గింపుపై బీజేపీ ప్రభావం

- అందోల్, జోగిపేట మున్సిపాలిటీలో బలం పుంజుకున్న బీజేపీ
- 28 వేల నుంచి 16వేలకు తగ్గిన కాంగ్రెస్ మెజార్టీ
- 34,186 ఓట్లకే పరిమితమైన బీఆర్ఎస్

**జోగిపేట(అందోల్):** జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో అందోలు నియోజకవర్గంలో బీజేపీ ప్రభావంతో కాంగ్రెస్ పార్టీకి మెజార్టీకి తగ్గింది. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి 82612, బీజేపీకి 66118, బీఆర్ఎస్‌కు 34186 ఓట్లు సాధించాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 1,14,147 ఓట్లు రాగా 28,193 ఓట్ల మెజార్టీనొ దక్కించుకుంది.ద కాగా ఈ లోక్‌సభ ఎన్నికల్లో 82,612 ఓట్లు రాగా, బీజేపీ ప్రభావంతో కాంగ్రెస్‌కు కేవలం 16,494 ఓట్ల మేజార్టీ మాత్రమే వచ్చింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో 5524 ఓట్లకు పరిమితమైన బీజేపీ ఈ ఎన్నికల్లో అనూహ్యరీతిలో 66,118 ఓట్లను సాధించి ఒక్కసారిగా ఓటింగ్ శాతాన్ని పెంచుకుంది. ఇక బీఆర్ఎస్ గ్రాఫ్ మరింత దారుణంగా పడిపోయింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు 85,954 ఓట్లు రాగా ఈ ఎన్నికల్లో కేవలం 34,186 ఓట్లకు మాత్రమే పరిమితమై 51768 ఓట్లకు పడిపోయింది. ఇక అందోలు–జోగిపేట మున్సిపాలిటీలో బీజేపీ బలం పుంజుకుంది. మున్సిపాలిటీలోని 20 వార్డుల ఉండగా, 1300 ఓట్ల మెజార్టీతో ముందువరుసలో ఉండటం గమనార్హం. ఈ ఏడాది కాంగ్రెస్ గెలుపుతో ఆ పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకుంటున్నాయి.

# ధాన్యం తడిసిందని రైతుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

**శివ్వంపేట(నర్సాపూర్):** కొనుగోలు కేంద్రం నుంచి తూకం వేసి రైస్‌మిల్‌కు తరలించిన ధాన్యం తిరిగి పంపించడంపై రైతులు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. మండల పరిధిలోని పెద్దగొట్టిముక్లలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రానికి రైతులు తెచ్చిన ధాన్యం తూకం వేసి డీసీఎంలో రైస్‌మిల్‌కు తరలించారు. అనంతరం ధాన్యం తడిసిపోయాయని తిరిగి పంపించడంపై రైతులు నిరసన వ్యక్తం చేశారు. సకాలంలో ధాన్యం తరలింపు చేపట్టకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నామని రైతులు నర్సింలు, మల్లేశ్, భిక్షపతి, రమేశ్, నవీన్ అన్నారు. ఈ విషయం గురించి పీఏసీఎస్ సీఈఓ మధు దృష్టికి తీసుకెళ్లగా.. తూకం అనంతరం వర్షం రావడంతో ధాన్యం తడిపోయిందని రైస్‌మిల్ యాజమాన్యంతో మాట్లాడి సమస్య పరిష్కస్తామన్నారు.

### పది శాతం పెరిగిన టోల్ చార్జీలు

**తూప్రాన్:** పట్టణ శివారులోని 44వ జాతీయ రహదారిపై ఉన్న టోల్ ప్లాజాలో వాహనాల టోల్ చార్జీలు 10 శాతం పెంచుతూ ఎన్‌హెచ్ఎఐ సోమవారం నుంచి అమల్లోకి తెచ్చింది. ప్రతీ సంవత్సరం ఏప్రిల్‌లో టోల్ చార్జీలు పెంచుతూ వస్తుంది. కానీ ప్రస్తుత లోకసభ ఎన్నికల నేపథ్యంలో వాయిదా వేసిన అధికారులు ఎన్నికలు పూర్తి కావడంతో సోమవారం నుంచి 10 శాతం ధరలు పెంచుతూ నిర్ణయించడంతో అమల్లోకి వచ్చాయి. పెరిగిన టోల్ ధరలతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# చెరువు అభివృద్ధితో రైతులకు లబ్ధి



కట్ట మరమ్మతులను పరిశీలిస్తున్న ఎంపీపీ

**శివ్వంపేట(నర్సాపూర్):** స్వచ్ఛంద సంస్థలు చెరువులను అభివృద్ధి చేయడంపై రైతులకు ఎంతగానో లబ్ధి చేకూరుతుందని ఎంపీపీ కల్లూరి హరికృష్ణ అన్నారు. మండల పరిధిలోని ఎదుల్లాపూర్ గ్రామంలోని సింగయ్య చెరువుని షెగల్ స్వచ్ఛంద సంస్థ అభివృద్ధి చేస్తుండడంతో ఆదివారం పరిశీలించి పలు సూచనలు చేశారు. కట్ట వెడల్పు పటిష్టంగా చేయాలని నిర్వాహకులకు సూచించారు. సూమారు 30 లక్షల నిధులతో స్వచ్ఛంద సంస్థ గ్రామ చెరువు పూటికి తీయడంతో పాటు, కట్ట వెడల్పు, తూము మరమ్మతులు చేపట్టడడం అభినందనీయమన్నారు. పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ షేగల్ స్వచ్ఛంద సంస్థ కో ఆర్డినేటర్ వేమనారాయణ, గ్రామస్తులు ఉన్నారు.

## ఆగ్రోస్‌లో అందుబాటులో జీలుగు విత్తనాలు



ఆగ్రోస్ రైతుసేవా కేంద్రంలో జీలుగు బస్తాలను దింపుతున్న సిబ్బంది

**కౌడిపల్లి(నర్సాపూర్):** మండల కేంద్రం కౌడిపల్లిలోని ఆగ్రోస్ రైతుసేవా కేంద్రంలో జీలుగు విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఏఓ స్వప్న, ఏఈఓ రాజశేఖర్‌గౌడ్ మంగళవారం తెలిపారు. కావాల్సిన రైతులు పట్టాదార్ పాస్‌బుక్, ఆధార్ కార్డు జిరాక్స్‌తో ఆగ్రోస్ రైతుసేవా కేంద్రంలో సంప్రదించాలని చెప్పారు. 65 బస్తాలు అందుబాటులో ఉన్నాయన్నారు. సబ్సిడీ పోను 30కిలోల బస్తా రూ. 1,116కు లభిస్తుందన్నారు.

# ఘనంగా కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు



జహీరాబాద్ కౌంటింగ్ కేంద్రం వద్ద విజయ సంకేతం చూపుతున్న సురేష్ షెట్కార్, నాయకులు



కల్హేర్: సంబరాలు జరుపుకుంటున్న నాయకులు, కార్యకర్తలు

**ఝురాసంగం(జహీరాబాద్):** జహీరాబాద్ ఎంపీగా కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ కుమార్ షెట్కార్ విజయం సాధించడంతో ఆ పార్టీ శ్రేణులు మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో టపాసులు కాలుస్తూ ఘనంగా విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హన్మంతరావు పాటిల్, సర్పంచ్‌ల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు రుద్రప్ప పాటిల్, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఉదయ్‌శంకర్ పాటిల్, నాయకులు అష్రఫ్ అలీ, పెంటయ్య, సంగారెడ్డి, ఫక్రుద్దీన్, రవుఫ్, మోహన్, రమేష్, గోపాల్, కృష్ణ, శంకర్, రజాక్, రాంరెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.

**కల్హేర్ మండల పరిధిలో...**

**కల్హేర్(నారాయణఖేడ్):** జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి సురేష్‌షెట్కార్ గెలుపొందడంతో కల్హేర్, సిర్గాపూర్ మండలాల్లో ఆ పార్టీ శ్రేణులు విజయోత్సవ సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పోచయ్య, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, కిష్టారెడ్డి, లతీఫ్, నారాయణ, అనిల్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## డీసీసీబీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

**కల్హేర్(నారాయణఖేడ్):** డీసీసీబీ ద్వారా అందిస్తున్న సేవలను రైతులు, స్వయం సహాయక సంఘాలతో పాటు ఇతర వర్గాల వారు సద్వినియోగం చేసుకోవాలని సిర్గాపూర్ డీసీసీ బ్యాంక్ మేనేజర్ రవీందర్ అన్నారు. సిర్గాపూర్ మండలంలోని సుల్తానాబాద్, బోక్కస్‌గాం, తదితర చోట్ల డీసీసీబీ సేవలపై ఇంటింటా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ 10 ఏళ్ల పిల్లల కోసం సహకార బచ్‌పన్ భరోసా డిపాజిట్ పథకం ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఈ పథకంపై ఈ నెల 30 వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ శ్రీనివాస్, సిబ్బంది శిల్ప, సాయిలు పాల్గొన్నారు.

IndusInd Bank - CFD
COMMERCIAL VEHICLES FOR SALE
1) JD 5045D TREM 3A 45HP PS COLLAR 2019 MODEL TS15 YTR 6019
2) MAHINDRA 575 DI BP MKM OIB WL 2014 MODEL AP07 TH 7920
3) JOHN DEERE 5105 40 HP 2023 MODEL
Engine No : PY3029D747735, Chassis No : 1VY5105DEPH044215
4) MM 275 TU XP PLUS 13.6 PS DC OIB 2022 MODEL TS35 H 4217
5) MAHINDRA 415 BP LARGE TYRE OIB 2019 MODEL TS35 T 6277
Cell : 79950 07539
Plot No: 10-11, 1st Floor, Roshini Complex, Pothireddypally X Road, SANGAREDDY.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
కె. చంద్రారెడ్డి -9912220353
కె. సంగారెడ్డి -9010294400